నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, ఆదివారం 25 ఆగస్టు 2024 RANGAREDDY



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకటరామయ్య

## రాడార్ స్టేషన్ నిర్మాణంపై పునరాలోచించాలి

**12 లక్షల చెట్లను కొట్టివేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి**

**ప్రభుత్వం అడవులను పరిరక్షించాలి**

**ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకటరామయ్య**

వికారాబాద్, ఆగస్టు 24 : నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణంపై పునరాలోచించాలని ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకటరామయ్య తెలిపారు. శనివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ముద్ద వీర మల్లప్ప కన్వెన్షన్ హాల్‌లో (ఏఐకేఎంఎస్) అఖిల భారత రైతు కూలి సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకటరామయ్య, తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వీ కోటేశ్వరరావు, వెంకన్న మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణం కోసం 12 లక్షల చెట్లను కొట్టివేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, అడవులను సంరక్షించాలని తెలిపారు. నిరుపయోగమైన భూములు దేశంలో ఎన్నో ఉన్నాయని, అలాంటి చోట రాడార్ స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.రెండు లక్షల పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పిందని, ఎలాంటి షరతులు లేకుండా ప్రతి రైతు రుణాన్ని మాఫీ చేయాలన్నారు. కౌలు రైతుల సంక్షేమం కోసం కృషి చేయాలని, వారికి కూడా పెట్టుబడి సాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు వై మహేందర్, నాయకులు డేవిడ్ కుమార్, నాగేశ్వరరావు, భూమన్న, సారంగపాణి, నర్సయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వం అందించిన చెక్కుతో డిపో మేనేజర్, సిబ్బంది

## ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోకు రాష్ట్రస్థాయి అవార్డు

**రాష్ట్రంలోనే రెండో డిపోగా ఎంపిక**

**గత సంవత్సరం రాష్ట్రస్థాయిలో మూడో స్థానం పొందిన ఇబ్రహీంపట్నం డిపో**

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24 : ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోను రాష్ట్రంలోనే ఉత్తమ రెండో డిపోగా అధికారులు ఎంపిక చేశారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, అధికారులు బహుమతిని అందజేశారు. ఈ మేరకు డిపో కార్మికులు, అధికారులు శనివారం రూ.2.50లక్షల చెక్కును అందుకున్నారు. ఆదాయం రాబట్టడంతో పాటు తక్కువ ఖర్చుతో డిపోను అధిక లాభాల వైపు తీసుకురావడంలో కార్మికులు, అధికారులు చేసిన కృషి ఫలితంగా అవార్డు దక్కిందని డిపో మేనేజర్ తెలిపారు. కాగా, రాష్ట్రంలో ఉన్న 98 ఆర్టీసీ డిపోల్లో ఇబ్రహీంపట్నం డిపోకు రెండో ఉత్తమ అవార్డు దక్కడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో ఉన్న 98డిపోల్లో మొదటి బహుమతి ఖమ్మం జిల్లా సత్తుపల్లికి, రెండో బహుమతికి ఇబ్రహీంపట్నం, మూడో బహుమతి సిద్దిపేటకు దక్కిందని డిపో మేనేజర్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం డిపోను అధికారులు, సిబ్బంది పట్టుబట్టి గత సంవత్సరం రాష్ట్రంలోనే మూడో ఉత్తమ డిపోగా ఎంపిక చేసుకున్నారని, ఈ ఏడాది రెండో ఉత్తమ డిపోగా అవార్డును తీసుకునేలా కృషి చేశారన్నారు. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో గ్రామీణ ప్రాంతాలకు అధిక ట్రిప్పులను నడుపడంతో పాటు రెవెన్యూ అధికంగా వచ్చే రూట్లల్లో ఎక్కువ ట్రిప్పులు నడిపించి అధిక లాభాలు రాబట్టారని డిపో మేనేజర్ వివరించారు.

**మొదటి స్థానానికి తీసుకొస్తాం : డిపో మేనేజర్ వెంకటనర్సప్ప**

ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోను రాష్ట్రంలోనే ఉత్తమ డిపోగా ఎంపిక చేసుకోవడం కోసం డిపోలోని కార్మికులు, తామంతా కృషి చేస్తామని డిపో మేనేజర్ వెంకటనర్సప్ప అన్నారు. గత సంవత్సరం మూడో బహుమతి, ఈ ఏడాది రెండో బహుమతి అందుకున్న తాము, మొదటి బహుమతిని కూడా చేరుకోవడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామన్నారు. ఉద్యోగులందరి కృషి వల్లనే అవార్డును అందుకున్నామన్నారు. సిబ్బంది అంతా సమష్టిగా కృషి చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో డిపోను నిలుపాలని కోరారు.

## భయపెట్టి.. ఆశపెట్టి!




**అందినకాడికి దోచుకున్న సైబర్ నేరగాళ్లు**

**గుజరాత్‌లో మన పోలీసుల స్పెషల్ ఆపరేషన్**

**20 కేసుల్లో 36 మంది సైబర్‌నేరగాళ్లు అరెస్ట్**

**దేశవ్యాప్తంగా 983 కేసులతో నిందితులకు లింక్**

సిటీబ్యూరో, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): అమాయకులను దోచేస్తున్న సైబర్ నేరగాళ్ల ఆటకట్టించి పట్టుకున్నారు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు. గుజరాత్ రాష్ట్రంలో 7 బృందాలతో గాలించి.. 20 కేసుల్లో 36 మంది సైబర్ నేరగాళ్లను పట్టుకున్నామని, వీరికి దేశ వ్యాప్తంగా 983 కేసులతో సంబంధాలున్నాయని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు.

**వృద్ధురాలిని భయపెట్టి..**

సికింద్రాబాద్‌కు చెందిన 74 ఏండ్ల వృద్ధురాలికి తాము ముంబై అందేరీ పీఎస్ పోలీసులం మాట్లాడుతున్నామని, ఫెడెక్స్ కొరియర్‌లో 'మీ పేరుతో డ్రగ్స్ సరఫరా అవుతున్నాయి.. మీపై మనీలాండరింగ్ కేసు నమోదైంది' అంటూ.. కాల్ చేసి బెదిరించి రూ.1.6 కోట్లు దోచేశారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ప్రధాన నిందితుడు కోల్‌కతాకు చెందిన దీపక్ రావత్ దుబాయ్‌లో ఉంటూ గుజరాత్‌కు చెందిన సాగర్ గోర్ధానభాయ్ ప్రజాపతి, పరంకర్ కిరీట్ నాథూభాయ్ సహకారంతో బ్యాంకు ఖాతాలను సమకూర్చుకొని.. ఈ మోసం చేసినట్లు గుర్తించారు. ప్రధాన నిందితుడిపై ఎల్‌వోసీ జారీ చేయగా, మిగతా ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీపీ వెల్లడించారు. నిందితుల నుంచి రూ.10.08 లక్షల నగదు, వివిధ బ్యాంకు చెక్ పుస్తకాలు, 22 బ్యాంకు ఖాతాల డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నామన్నారు.

**ట్రేడింగ్ పేరుతో..**

ట్రేడింగ్ పేరుతో రాంకోఠికి చెందిన ఓ వ్యాపారిని వాట్సాప్‌లో సంప్రదించిన సైబర్‌నేరగాళ్లు..'మేం చెప్పినట్లు ట్రేడింగ్ చేస్తే.. 500 శాతం లాభాలొస్తాయి'..అంటూ నమ్మించి దఫ దఫాలుగా బాధితుడి నుంచి రూ. 2 కోట్లు వసూలు చేశారు. పోలీసులు దర్యాప్తు చేయగా బ్యాంకు ఖాతాలు గుజరాత్‌లో ఉన్నట్లు గుర్తించారు. అక్కడకు వెళ్లిన బృందం స్పిన్నింగ్ మిల్ వ్యాపారం చేసే చుదాసమ కుల్‌దీప్‌సిన్హా అనోప్ సిన్హా, ప్రైవేటు ఉద్యోగి జడేజా దైవత్‌సిన్హా కృతిసిన్హా, కారు డ్రైవర్ సినోజియ కేతాన్ సురేశ్‌భాయ్‌లను పట్టుకున్నారు. ఈ ముగ్గురు బ్యాంకు ఖాతాలు అపరేట్ చేస్తూ విదేశాల్లో ఉండే ప్రధాన నిందితులకు సహకరిస్తుంటారు. బాధితులు ఆయా బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేసిన నగదును హవాలా మార్గంలో నిందితులకు పంపిస్తున్నారు.

**చార్టెడ్ అకౌంటెంట్ అరెస్ట్...**


బేగంపేటకు చెందిన రిటైర్డు ఉద్యోగికి వాట్సాప్‌లో సంప్రదించిన సైబర్ నేరగాళ్లు.. మోతెలై.కామ్ పేరుతో ఉన్న ఒక అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేయించి.. దాని ద్వారా ట్రేడింగ్ చేయిస్తూ రూ. 60.88 లక్షలు దోచేయగా, పోలీసులు బ్యాంకు ఖాతాల ఆధారంగా గుజరాత్‌కు వెళ్లి దర్యాప్తు జరిపారు. కనాని నికుంజ కిశోర్ భాయ్ వృత్తిరీత్యా చార్టెడ్ అకౌంటెంట్, ప్రవీణ్ భాయ్ కలుభాయ్ వసోయ అనే మరో వ్యక్తితో కలిసి ఈ నేరాలు చేస్తున్నట్లు గుర్తించారు. మొదట్లో కొన్ని లాభాలు చూపించి, ఆ తరువాత భారీగా పెట్టుబడులు పెట్టిస్తూ ఈ ఇద్దరు అమాయకుల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్నట్లు తేలింది. నిందితులిద్దరిని అరెస్ట్ చేసి రూ. 27.20 లక్షల నగదు, 226 చెక్ బుక్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దేశ వ్యాప్తంగా ఈ నిందితులకు 142 కేసులతో సంబంధం ఉన్నట్లు వెల్లడైంది.

### కాంగ్రెస్.. మాట నిలబెట్టుకోవాలె..



ఎన్నికలప్పుడు ఇచ్చిన మాటను కాంగ్రెస్ నిలబెట్టుకోవాలె. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిండు. పెద్దేముల్ మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘంలో రూ.లక్షా 25 వేల అప్పు తీసుకున్నా. మూడో విడుతలోనూ మాఫీ కాలె. నిత్యం బ్యాంకు, వ్యవసాయ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా. వాళ్లు ఏవేవో కారణాలు చెప్పి మాట దాటవేస్తుండ్రు. కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి ఓటు వేసినం. రైతులను మోసం చేసే ఏ పార్టీ అయినా మట్టికొట్టుకుపోవాల్సిందే. రైతులను ఇబ్బందులు పెడితే రాబోవు రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదు.

– రాంచందర్, గిర్మాపూర్, పెద్దేముల్ మండలం



## రుణమాఫీ గ్రీవెన్స్

# కాలయాపనకే..

**రోజూ వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ రైతుల పడిగాపులు**

**త్వరలో రుణమాఫీ అవుతదంటూ రైతులను పంపిస్తున్న అధికారులు**

**రుణమాఫీపై తొలగని గందరగోళం**

**రూ.2 లక్షలపైన ఉన్న రుణాలను చెల్లించినా ఇంకా స్పష్టత కరవు**

**వికారాబాద్ జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 4642 ఫిర్యాదులు**

వికారాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ) : రుణమాఫీ కానివారి కోసం గ్రీవెన్స్ అనేది కేవలం కాలయాపన కోసమేనంటూ రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొదటి విడుత రుణమాఫీ జాబితా విడుదల నుంచి రైతులు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంతోపాటు ఏడీ కార్యాలయాలు, మండల వ్యవసాయాధికారి కార్యాలయాల్లో రుణమాఫీ కాలేదంటూ ఫిర్యాదు చేస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఒక్క ఫిర్యాదును కూడా ప్రభుత్వం పరిష్కరించి, రుణమాఫీ చేయకపోవడం గమనార్హం. అర్హులైనప్పటికీ రుణమాఫీ కాకపోవడంతో రైతులు మండల వ్యవసాయాధికారి కార్యాలయంతోపాటు ఏడీ కార్యాలయం, జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఒక్కో రైతు ఇప్పటికీ నాలుగైదు సార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 1.70 లక్షల మంది రైతులు పంట రుణాలు తీసుకుంటే వీరిలో కేవలం 91 వేల మంది రైతులకు మాత్రమే రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. జిల్లాలో రూ.2 లక్షలలోపు రుణమాఫీతో కేవలం 91,956 మంది రైతులకు మాత్రమే లబ్ధి చేకూరింది. మొదటి విడుతలో రూ.లక్షలోపు రుణమాఫీతో 46,633 మంది రైతులకుగాను రూ.256.26 కోట్ల రుణమాఫీ కాగా, రెండో విడుతలో రూ.లక్షన్నరలోపు రుణమాఫీతో 26,438 మంది రైతులకుగాను రూ.265.04 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. చివరి విడుతలో రూ.2 లక్షల లోపు రుణమాఫీతో 18,885 మంది రైతులకుగాను రూ.247.71 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. అయితే రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవడం, ఒకరి ఆధార్ నంబర్‌కు బదులు మరొకరి ఆధార్ నంబర్ ఎంట్రీ చేయడం, వడ్డీని కలుపకుండా కేవలం రైతులు తీసుకున్న రుణాలను మాత్రమే ఎంట్రీ చేయడం తదితర కారణాలతో జిల్లాలోని దాదాపు 80 వేల మంది అన్నదాతలకు రుణమాఫీ లబ్ధి చేకూరలేదు.



**రుణమాఫీ గ్రీవెన్స్‌కు 4642 ఫిర్యాదులు...**

జిల్లాలో రుణమాఫీ కాలేదని అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి. వ్యవసాయ కార్యాలయాలతోపాటు బ్యాంకుల వద్ద ఉదయం నుంచే ఫిర్యాదులు చేసేందుకు రైతులు బారులు తీరుతున్నారు. గత 20 రోజులుగా వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా త్వరలో మీ రుణాలు మాఫీ అవుతాయంటూ సమాధానం చెబుతూ రైతులను పంపించేస్తున్నారు. వ్యవసాయాధికారులు, బ్యాంకర్లు చెబుతున్న సమాధానాలకు ఏ మాత్రం పొంతన లేకపోవడంతో వ్యవసాయ కార్యాలయాల వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా రూ.2 లక్షల రుణాలను మాఫీ చేయాలని మిగతా రుణాలను ఎన్ని కష్టాలు పడినా మేం చెల్లించుకుంటామని, మీరిచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో ఫిర్యాదు చేసేందుకు వచ్చే రైతులకు వ్యవసాయాధికారులు ఏదో ఒకటి చెబుతూ పంపిస్తున్నారు. మరోవైపు రూ.199,999 రుణాలను మించి ఉన్న రైతుల పరిస్థితి మరీ గందరగోళంగా తయారైంది. కటాఫ్ రుణానికి మించి ఉన్న రైతుల్లో చాలా మంది ఇప్పటికే పైన ఉన్న రుణాలను చెల్లించి సంబంధిత రసీదులను వ్యవసాయాధికారులకు అందజేసినప్పటికీ ఎలాంటి స్పష్టత లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కటాఫ్ రుణానికి మించి ఉన్న రుణాలను చెల్లిస్తేనే మాఫీ అవుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నప్పటికీ ఎప్పుడు మాఫీ అవుతదనేది, దానికి సంబంధించిన విధివిధానాలు మాత్రం ఇప్పటి వరకు ఖరారు కాకపోవడం గమనార్హం. మరోవైపు రుణాలు రూ.2 లక్షల పైచిలుకు ఉన్న రైతులు డబ్బును చెల్లించేందుకుగాను వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. రుణమాఫీ వర్తించాలంటూ కటాఫ్ రుణాలకు మించి ఉన్న మొత్తాన్ని చెల్లించేందుకు రైతులపై పరోక్షంగా ఒత్తిడి తెస్తుండడంతో అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. ఇప్పటికే పంట పెట్టుబడికి అప్పులు చేసిన రైతులు, ఇప్పుడు రుణమాఫీ వర్తించేందుకు అప్పులు చేస్తుండడం భారంగా మారిపోయింది. గ్రీవెన్స్‌కు సంబంధించి ప్రత్యేకంగా పోర్టల్ అందుబాటులోకి తీసుకురాక ముందు జిల్లావ్యాప్తంగా 2500 వరకు ఫిర్యాదులు రాగా, గత వారం రోజులుగా 4642 మంది రైతులు రుణమాఫీ కాలేదని ఫిర్యాదులను అందజేశారు.

**రుణమాఫీ గ్రీవెన్స్‌కు అందిన ఫిర్యాదులు**

| మండలం | ఫిర్యాదులు |
|---|---|
| వికారాబాద్ | 367 |
| ధారూరు | 340 |
| నవాబుపేట | 1071 |
| మోమిన్‌పేట | 149 |
| కోట్‌పల్లి | 117 |
| బంట్వారం | 42 |
| మర్పల్లి | 201 |
| పరిగి | 395 |
| పూడూరు | 297 |
| కులకచర్ల | 113 |
| చౌడాపూర్ | 4 |
| దోమ | 145 |
| తాండూరు | 70 |
| యాలాల | 246 |
| పెద్దేముల్ | 52 |
| బషీరాబాద్ | 107 |
| కొడంగల్ | 96 |
| దౌల్తాబాద్ | 404 |
| బొంరాస్‌పేట | 426 |
| మొత్తం | 4642 |

### అర్హత ఉన్నా మాఫీ కాలె..



తాండూరు పట్టణంలోని ఎస్‌బీఐ (ఏడీబీ) బ్యాంకులో పంట రుణం తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన నిబంధనలకు అర్హత ఉన్నా రుణమాఫీ కాలె. ఎన్నికలప్పుడు ప్రతి రైతుకూ రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి గొప్పలు చెప్పిండు. ఇప్పుడేమో నానా ఇబ్బందులు పెడుతుండ్రు. రుణమాఫీ కొందరికేనా అందరికా.. అర్థం కావడం లేదు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన మాట తప్పి రైతులను మోసం చేయాలని చూస్తున్నది. రుణమాఫీ కోసం ప్రతి పల్లెలోని రైతులు నానా తంటాలు పడుతుండ్రు.

– శంకర్ నాయక్, జయరాం తండా(ఓమ్లానాయక్ తండా), పెద్దేముల్ మండలం

### కాంగ్రెస్‌వన్నీ మాయ మాటలే..



ఏకకాలంలో రైతులందరికీ రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ మాయ మాటలు చెప్పింది. ఇప్పుడు లేని కొర్రీలు పెట్టి రైతులను ఇబ్బంది పెడుతున్నది. పెద్దేముల్ మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.లక్షా 4వేల రుణం తీసుకున్నా. ఇంత వరకు మొదటి దఫా, రెండవ దఫా, మూడో దఫాలోనూ రుణమాఫీ కాలె. అధికారులను అడిగితే ఎన్నో సాకులు చెబుతున్నారు. అరకొర మాఫీలు చేసి గొప్పలు చెప్పుకోవడం తప్ప పూర్తిస్థాయిలో రుణాలను మాఫీ చేసి రైతులను మెప్పించింది లేదు. ఈ కాంగ్రెస్‌ను మళ్లా ఎట్లా నమ్మాలి.

– కే మహేశ్, మారేపల్లి గ్రామం, పెద్దేముల్ మండలం

## హైదరాబాద్-బీజాపూర్ రోడ్డు పనులు ప్రారంభించాలి

**రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

మొయినాబాద్, ఆగస్టు 24 : హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పనులను వారం రోజుల్లో ప్రారంభించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మొయినాబాద్‌లో ఓ ప్రైవేటు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు మీద రద్దీ విపరీతంగా పెరుగడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు పనులను చేయించాలని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి జాతీయ రహదారికి సంబంధించిన ఉన్నతాధికారులతో ఫోన్‌లో నాయకుల ముందు స్పీకర్ పెట్టి మాట్లాడారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై నిత్యం రెండు నుంచి మూడు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని వెంటనే పనులు వారం రోజుల్లో ప్రారంభించాలని ఆదేశించారు. లేకపోతే టెండర్‌ను రద్దు చేయడం జరుగుతుందని సంబంధిత కాంట్రాక్టర్‌ను కూడా హెచ్చరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వారం రోజుల్లో రోడ్డు విస్తరణ పనుల ప్రగతి తమకు కనిపించాలని మంత్రి అధికారులతో చెప్పారు.

**పంచాయతీ రాజ్ నుంచి ఆర్ అండ్‌బీకి మార్చుతాం..**

రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని పొడవైన రోడ్లను పంచాయతీ రాజ్ నుంచి ఆర్‌అండ్‌బీకి మార్చుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. మొయినాబాద్ మండల పరిధిలోని కవేలిగూడ నుంచి వయా శ్రీరాంనగర్, సురంగల్, మొయినాబాద్, పెద్దమంగళారం గ్రామాల మీదుగా చందానగర్ వరకు ఉన్న పంచాయతీ రాజ్ రోడ్డును ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మార్చాలని స్థానిక రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, షాబాద్ దర్శన్, మాజీ సర్పంచ్ మాణెయ్యా, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీరాజ్ రోడ్లను ఆర్‌అండ్‌బీకి మార్చడం జరుగుతున్నదని, రోడ్లు అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని మంత్రి హామీ ఇచ్చారు. తప్పకుండా ఆ రోడ్డు ఆర్‌అండ్‌బీ పరిధిలోకి తీసుకోవడం జరుగుతున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామన భీంభరత్, రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంత రెడ్డి, షాబాద్ దర్శన్, కీసరి సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ మాణెయ్య, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి, నాయకులు రవియాదవ్, మహేందర్‌రెడ్డి, బాల్‌రాజ్, షాబాద్ శ్యాం, అమర్‌నాథ్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి కోసం అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి